సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



అధికారంలోకి వస్తాం

రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వ మేనని ఏఐసీసీ కార్యదర్శి, కేరళ రాష్ట్ర ఎమ్మెల్యే విష్ణునాథ్ అన్నారు. 8లో▸



హక్కులను కాలరాస్తున్నారు

ముదిరాజ్ హక్కులను బీఆర్ఎస్ ప్రభుత్వం కాలరాస్తోందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మంతు ముదిరాజ్ అన్నారు. 8లో▸



వానొస్తే కరెంట్ కట్

పలు గ్రామాల్లో ప్రమాదకరంగా మారిన స్తంభాలతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. 9లో▸

న్యూస్‌రీల్

'కోట్‌పల్లి'ని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



కోట్‌పల్లి ప్రాజెక్టును వీక్షిస్తున్న స్యామ్ ఖుషి

ధారూరు: ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టును హైకోర్టు న్యాయమూర్తి స్యామ్ ఖుషి కుటుంబ సమేతంగా గురువారం సందర్శించారు. చుట్టూ అడవి.. మధ్యలో ప్రాజెక్టు ఉన్న ప్రాంతాన్ని, ప్రాజెక్టు అలుగు నుంచి జాలువారుతున్న వరదనీటిని చూసి తన్మయం చెందారు. సెల్ఫీలు తీసుకుంటూ సరదాగా గడిపారు.ఆయన వెంట డీఎస్పీ నర్సింహులు, సీఐ రామకృష్ణ, ఎస్ఐ సంతోష్‌కుమార్ ఉన్నారు.

నిషేధిత భూములను ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారు?

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



భూ అక్రమ రిజిస్ట్రేషన్ వివరాలు వెల్లడిస్తున్న సీపీఎం నేతలు

పరిగి: నిషేధిత జాబితాలో ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేయడంలో అధికారుల పాత్రపై అనుమానాలకు తావిస్తోందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం వెంకటయ్య అన్నారు. గురువారం ఆయన పరిగిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కార్యాలయం బయట జరగడం ప్రభుత్వ పనితీరు ఎలా ఉందో అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. పరిగి మండలం రాఘవాపూర్‌లో 23.23 ఎకరాల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా అధికారులకు కోట్ల రూపాయలు ముడుపులు ముట్టాయని ఆరోపించారు. నిరుపేదలకు అన్యాయం చేస్తూ పెద్దలకు మేలు జరిగేలా అధికారులు వ్యవహరించడం సరికాదన్నారు. రాఘవాపూర్ సర్వే నంబర్లు 94, 95, 96లో 23.23 ఎకరాల సీలింగ్ భూములు ఉన్నాయని, 1973 సీలింగ్ చట్టం ప్రకారం వాటిని నిషేధిత జాబితాలో చేర్చడం జరిగిందన్నారు. ధరణి పోర్టల్ ద్వారా కొందరు ముడుపులు చెల్లించి వారి పేరిట భూములు రాయించుకున్నారని తెలిపారు. అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు పేదలకు న్యాయం జరిగేలా చూడాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు హబీబ్, సత్యయ్య, వెంకటయ్య, రఘురాం, శ్రీనివాస్, శేఖర్, లాలప్ప, శివ, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి



ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్‌లో మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు చేపడుతున్న సమ్మె గురువారానికి 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే తమను రెగ్యులర్ చేయాలని మున్సిపల్ కార్మిక ఉద్యోగుల అధ్యక్షులు చిన్నయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ కష్టాన్ని గుర్తించి వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఆ సంఘం ఉపాధ్యక్షుడు ఎండీ.దావుద్, కార్యదర్శి శంకర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వినూత్న నిరసన



శ్రీకృష్ణుడి అవతారంలో ఉన్న సీఎం చిత్రపటానికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

అనంతగిరి: సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఆ విభాగం ఉద్యోగులు గురువారం శ్రీకృష్ణ భగవాన్ రూపంలోని సీఎం కేసీఆర్ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా విద్యావ్యవస్థ పటిష్టత కోసం తాము పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వం అన్నిశాఖల ఉద్యోగుల మాదిరిగానే తమను కూడా రెగ్యులర్ చేయాలన్నారు.



బొంరాస్‌పేట: వెన్న ఆరగిస్తున్న చిన్ని కృష్ణుడు



మర్పల్లి: రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

ఉత్సాహంగా కృష్ణాష్టమి వేడుకలు

శ్రీ కృష్ణాష్టమి పర్వదిన వేడుకలను జిల్లా వాసులు గురువారం ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. పలు పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉట్టి కొట్టే వేడుకలో యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



తాండూరు టౌన్: ఉట్టి కొడుతున్న విద్యార్థినులు

కూలిన బతుకులు

నిర్మాణంలో ఉన్న పిట్టగోడ కూలి ముగ్గురి మృతి

- మరో ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలు
- అనుమతులకు మించి అదనంగా ఫ్లోర్ నిర్మాణం
- నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో తప్పిన పెను ప్రమాదం



రోడ్డుపై పడిపోయిన కార్మికుల మృతదేహాలు, పిట్టగోడ పెళ్లలు



భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ అడ్డగుట్ట సొసైటీలోని ఓ భవన నిర్మాణం ఎలివేషన్ సెంట్రింగ్ పనులు చేస్తుండగా ఆరో అంతస్తుపై ఉన్న పిట్టగోడ కూలిపోయింది. దీంతో భవన నిర్మాణానికి ఏర్పాటు చేసిన గోవా కర్రలు విరిగిపోయాయి. ఈ ఘటనలో కర్రలపై నిల్చుని పనిచేస్తున్న ముగ్గురు కార్మికులు మృతి చెందారు. మరో ముగ్గురు కార్మికులు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం ఉదయం 8.30 గంటలకు ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్ట సొసైటీలోని ఓ భవన నిర్మాణం చేపడుతున్నారు. ఎలివేషన్ కోసం సెంట్రింగ్ పనుల్లో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆరుగురు కార్మికులు పనుల్లో నిమగ్నమయ్యారు. సెంట్రింగ్ తొలగిస్తున్న సమయంలో పిట్టగోడ కూలి సానియా బట్నాయక్ (19), సామ బట్నాయక్ (23), సానియా చలాన్ (20)లు మృతి చెందారు. వీరితో పాటు పని చేస్తున్న ముదాబత్ నాయక్, బలరాం, సుప్రా బట్నాయక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సామ బట్నాయక్, సానియా చలాన్‌లు అక్కడికక్కడే మృతి చెందగా, సానియా బట్నాయక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భవనం పిట్టగోడ కూలిన విషయం తెలుసుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో గురువారం పెద్దగా జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మృతదేహాలను పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ భవనం దాసరి సంతోష్, దాసరి సాయిరాం పేరుపై 2022 డిసెంబర్ 2వ తేదీన జీ+5 అంతస్తులకు అనుమతులు తీసుకున్నారు. అదనంగా మరో ఫ్లోర్ అక్రమ నిర్మాణం చేపట్టారు. ఆ అంతస్తులోనే పని చేస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది.

నాణ్యత లేకపోవడంతోనే..

ఆరో అంతస్తుపై పిట్టగోడ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవటంతోనే ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోడలు, గోవా కర్రలు తడిచిపోయాయి. పిట్టగోడ కోసం నిర్మించిన సిమెంట్ పెళ్లలు గోవా కర్రలపై పడిపోగా అవి విరిగి వాటిపై నిల్చుని పని చేస్తున్న కార్మికులు కింద పడిపోయారు. అనుమతులు పొందిన దానికంటే అక్రమంగా అంతస్తులు నిర్మాణం చేపట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ముందుగానే అక్రమ అంతస్తులను అధికారులు అడ్డుకొని ఉంటే ముగ్గురి ప్రాణాలు గాలిలో కలిసేవి కావంటున్నారు.





మృతులు సానియా చలాన్, సామ బట్నాయక్, సానియా బట్నాయక్



గాయపడిన కార్మికుడు ముదాబత్ నాయక్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బలరాం

క్రిమినల్ కేసులు పెడతాం

ఈ ఘటనపై జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్ హరికృష్ణ స్పందించారు. ఈ ఘటనలో ముగ్గురి కార్మికుల మృతికి కారణమైన భవన యజమానులు, ఆర్కిటెక్ట్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అనుమతులు పొందిన దానికంటే అక్రమంగా నిర్మించిన మరో ఫ్లోర్ నిర్మాణాన్ని పూర్తిగా కూల్చివేస్తామని పేర్కొన్నారు. గతంలోనే రెండుసార్లు భవన యజమానికి జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశామని తెలిపారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ..

ప్రమాదవశాత్తు పిట్టగోడ కూలి ముగ్గురు కార్మికులు మృతి చెందడం, ముగ్గురు కార్మికులకు గాయాలు కావటం దురదృష్టకరమని స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. భవన యజమాని, బిల్డర్, సంబంధిత అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిజేస్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో ఇటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటామని, ప్రమాదానికి బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని ఆయన చెప్పారు.

ఇంకెన్నాళ్లు..!

- నిధులున్నా డంపింగ్ యార్డ్ నిర్మాణంలో అలసత్వం
- నాలుగేళ్లుగా ప్రహరీ, సీసీ రోడ్లతోనే సరి
- పిల్లర్ స్థాయిలో ఆగిన షెడ్డు నిర్మాణం
- రీ సైక్లింగ్ యంత్రాల కొనుగోలు, గార్డెనింగ్ ఊసే లేదు
- అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం

వికారాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనులు నత్తను తలపిస్తున్నాయి. పట్టణాన్ని డంపింగ్ యార్డు సమస్య వేధిస్తోంది. సుమారు లక్ష యాభై వేల జనాభా ఉన్న వికారాబాద్ పట్టణంలో రోజుకు 35 మెట్రిక్ టన్నుల చెత్త వస్తుంది. అయితే ఈ చెత్తను పట్టణానికి నాలుగు దిక్కులా కొన్ని స్థలాలను ఎంపిక చేసి అక్కడ వేస్తున్నారు. ప్రస్తుతం ఆ స్థలాలే డంపింగ్ యార్డులుగానే మారాయి. వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసన, చెత్తకు ఆకతాయిలు నిప్పు పెట్టడంతో వచ్చే పొగ కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే 2014లో మున్సిపల్ అధికారులు మేకలగండిలో సుమారు 6ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఇది డంపింగ్ యార్డు ఏర్పాటుకు అనువుగా ఉంటుందని అప్పటి కలెక్టర్ దివ్య దేవరాజన్‌కు ప్రతిపాదనలు పంపారు. డంపింగ్ యార్డు ఏర్పాటులో భాగంగా ప్రహరీ నిర్మాణానికి రూ. 30లక్షలు కేటాయించారు. 2016లో ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు.

కమీషన్ల కోసం కక్కుర్తి

డంప్‌యార్డు నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు ఉన్నా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. నాలుగేళ్లుగా షెడ్డు నిర్మాణం పిల్లర్ దశ వీడడం లేదు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు కమీషన్లకు కక్కుర్తి పడడంతోనే కాంట్రాక్టర్లు అలస్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంజనీరింగ్ విభాగంలో ఎలాంటి పనికైనా చేతులు తడిపితేగాని ఫైలు ముందుకు కదలదనే విమర్శలు ఉన్నాయి. అధికారుల తీరుతోనే పట్టణ ప్రజలకు మేలు జరిగే ఇలాంటి ఎన్నో పనులు సకాలంలో పూర్తి కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

మంజూరైన నిధులు	
ప్రహరీ నిర్మాణానికి	రూ.50 లక్షలు
షెడ్డు నిర్మాణానికి	రూ.1.32 కోట్లు
రీసైక్లింగ్ యంత్రం కొనుగోలుకు	రూ. కోటి
సీసీ రోడ్లు, గార్డెన్, ఇతర భవనాల నిర్మాణానికి	రూ. 1.50 కోట్లు

నాలుగేళ్లుగా పనులు

డంపింగ్ యార్డు నిర్మాణ పనులు నాలుగేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ప్రహరీ, సీసీ రోడ్డు పనులు మాత్రమే పూర్తయ్యాయి. షెడ్ల నిర్మాణం పిల్లర్ స్థాయి వీడడం లేదు. వ్యర్థాలను రీసైక్లింగ్ చేసేందుకు అవసరమైన యంత్రాల కొనుగోలు, గార్డెనింగ్, షెడ్ల నిర్మాణం ప్రారంభమే కాలేదు. డంపింగ్ యార్డు ఏర్పాటుపై అధ్యయనం చేసేందుకు 2017లో మున్సిపల్ సిబ్బంది ముంబై, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లి వచ్చారు. 2019లో అప్పటి కలెక్టర్ ఉమర్ జలీల్ డంప్‌యార్డ్ నిర్మాణానికి టీయూఎఫ్‌డీసీ నిధుల నుంచి రూ. కోటి 50లక్షలు కేటాయించారు. దశల వారీగా మరిన్ని నిధులు కేటాయిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం నిధులు పుష్కలంగా ఉన్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. సకాలంలో పనులు పూర్తి చేసి డంపింగ్ యార్డును అందుబాటులోకి తేవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పిల్లర్ స్థాయిలో ఆగిన షెడ్డు నిర్మాణం

ఎవరో.. 'హస్త'వాసి

- తాండూరు కాంగ్రెస్ టికెట్‌కు తీవ్ర పోటీ
- ఎనిమిది మంది దరఖాస్తు
- పరిశీలనలో ముగ్గురి పేర్లు?
- ఎంపీ టికెట్‌పై ఆశలు పెట్టుకున్న కేఎల్ఆర్
- పోటీలో రమేష్ మహరాజ్, రఘువీర్‌రెడ్డి



తాండూరు: తాండూరు హస్తం టికెట్‌పై ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. తాండూరు టికెట్ కోసం 8 మంది దరఖాస్తు చేయగా, అధిష్టానం ముగ్గురి పేర్లు పరిశీలనలోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే టికెట్ ఆశిస్తున్న వారు పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఆశావహుల్లో రమేష్ మహరాజ్, రఘువీర్‌రెడ్డి, కేఎల్ఆర్, సునితా సంపత్ పేర్లు బాగా వినిపిస్తున్నాయి. వీరిలో కేఎల్ఆర్ ఎంపీ టికెట్ పైనే ఆశలు పెట్టుకున్నట్లు సమాచారం. ఈ కారణంగానే అసెంబ్లీ టికెట్ కోసం పెద్దగా ప్రయత్నం చేయడం లేదనేది సమాచారం. రమేష్ మహరాజ్, రఘువీర్‌రెడ్డి మధ్య పోటీ తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. బీసీ సామాజిక వర్గానికి తాండూరు సీటు కేటాయిస్తే రమేష్ మహరాజ్ టికెట్ దక్కే అవకాశం లేకపోలేదు. జనరల్ అయితే రఘువీర్‌రెడ్డిని టికెట్ వరించనుంది. అలాగే మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునితా సంపత్‌కు కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోందంది. కర్ణాటక వైద్య విద్య శాఖ మంత్రి శరణు ప్రకాష్ పాటిల్ ద్వారా మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. ఇటీవల ఆయన్ను తాండూరుకు పిలిపించి టికెట్‌పై చర్చించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా తాండూరు అసెంబ్లీ అంటేనే మహరాజుల పేరు టక్కున గుర్తుకు వస్తుంది. ఈ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి 13సార్లు ఎన్నికలు జరగ్గా 7 సార్లు మహరాజుల కుటుంబ సభ్యులే కాంగ్రెస్ పార్టీ తరపున విజయం సాధిస్తూ వచ్చారు. 1994 ఎన్నికల్లో ఆ కుటుంబంలో విభేదాలు మొదలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ తరపున నారాయణరావు, రెబల్ అభ్యర్థిగా ఆయన సోదరుడు మాణిక్‌రావు బరిలో దిగడంతో టీడీపీ తరపున పట్నం మహేందర్‌రెడ్డి విజయం సాధించారు. ప్రస్తుతం మహరాజుల కుటుంబం టికెట్ కోసం తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నట్లు సమాచారం. మాజీ మంత్రి మాణిక్‌రావు తనయుడు ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్‌కు టికెట్ దక్కుతుందో లేదో మరి కొన్ని రోజుల్లో తేలనుంది. ఇదిలా ఉండగా గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచి ఆ తర్వాత బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న 12 మందిని ప్రస్తుత ఎన్నికల్లో ఎలాగైనా ఓడించాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం. ఈ జాబితాలో తాండూరు కూడా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన పైలెట్ రోహిత్‌రెడ్డి ఆరు నెలల్లోనే బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రోహిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేశారని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ఎలాగైనా ఆయన్ను ఓడించి తీరుతామని అంటున్నారు. మరోవైపు బీసీలకే టికెట్ కేటాయించాలని ఆ సామాజిక వర్గం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. నిన్నటి వరకు మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తాండూరు అసెంబ్లీ బరిలో దిగుతారంటూ ప్రచారం సాగింది. బుధవారం పార్టీ పెద్దలతో భేటీ అయినట్లు సమాచారం. మేడ్చల్ లేదా రాజేంద్రనగర్ నుంచి పోటీ చేయాలని కేఎల్ఆర్‌కు పార్టీ సూచించినట్లు సమాచారం. దీంతో రమేష్ మహరాజ్, రఘువీర్‌రెడ్డిల మధ్యే పోటీ ఉన్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రం సుభిక్షం

- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి
- రాహుల్ గాంధీ జోడో యాత్ర ఏడాది పూర్తయిన సందర్భంగా ర్యాలీలు

పరిగి: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, ప్రజలు కూడా ఇదే కోరుకుంటున్నారని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఒకటవ వార్డు మల్లెమోని గూడకు చెందిన బీఆర్ఎస్ నాయకులు గురువారం టీఆర్ఆర్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధే కనిపిస్తోందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను నిలువు దోపిడీ చేసిందని ఆరోపించారు. సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వరంగల్, చేవెళ్ల డిక్లరేషన్లతో బీఆర్ఎస్ నాయకులకు మాట్లాడే అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కృష్ణయ్యకు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందిన రావులపల్లికి చెందిన చౌదూరి కృష్ణయ్యను గురువారం డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి తన నివాసంలో ఘనంగా సన్మానించారు. పరిగి ప్రాంత వాసికి డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందన్నారు.

జోడో యాత్రతో దేశాన్ని ఏకం చేశారు

భారత దేశాన్ని ఐక్యంగా ఉంచాలనే కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం నాటికి భారత్ జోడో యాత్ర ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్, ఇందిరా గాంధీ విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ జోడో యాత్రకు దేశం మొత్తం మంచి స్పందన వచ్చిందన్నారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ నెల 16న సీడబ్ల్యూసీ కార్యవర్గ సమావేశాన్ని నగరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు విజయ్ కుమార్‌రెడ్డి, అశోక్, నర్సింహ, మాధవరెడ్డి, అనంతరెడ్డి, చిన్న నర్సింహులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పరిగి ప్రధాన కూడలిలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న టీఆర్ఆర్ తదితరులు

తాండూరులో గెలిచేది కాంగ్రెస్సే

- పట్నం, పైలెట్ కలిసినా ఓడిస్తాం
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్

పెద్దేముల్: గతంలో మహేందర్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడే కాంగ్రెస్ పార్టీ ఆయన్ను ఓడించింది.. ఇప్పుడు పట్నం, పైలెట్ కలిసినా రోహిత్‌రెడ్డిని ఓడిస్తాం అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ అన్నారు. భారత్ జోడో యాత్ర చేపట్టి ఏడాది కావడంతో పెద్దేముల్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన రోహిత్‌రెడ్డి బీఆర్ఎస్‌లోకి వెళ్లి ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ టికెట్ ఎవరికి ఇచ్చినా గెలుపు ఖాయమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. దళిత బంధు పేరుతో ఒక్కో కార్యకర్త రూ.2 లక్షల వసూలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపాల్, శంకర్, ప్రవీణ్, నసిరొద్దీన్, సుందర్‌రాజ్, వెంకటయ్య, చంద్రశేఖర్, మల్లప్ప, రాము, మైపూస్, ఎల్లారెడ్డి, బందెప్ప, డీవై నర్సింలు, షబ్బీర్, ఆనంద్‌చారి పాల్గొన్నారు.



పెద్దేముల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

క్లుప్తంగా

యాలాల ఠాణాను సందర్శించిన డీఎస్పీ

యాలాల: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ సందర్శించారు. ప్రతి ఏడాది సామాన్యంగా నిర్వహించే తనిఖీల్లో భాగంగా ఠాణాను సందర్శించారు. కేసుల వివరాలు, రికార్డులు నిర్వాహణ, పీఎస్‌లో పారిశుద్ధ్య నిర్వహణ తదితర వాటిని పరిశీలించారు. పీఎస్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పీఎస్ సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో పాటు ఎస్‌ఐ అరవింద్‌కుమార్ ఉన్నారు.

కోట్‌పల్లి ప్రాజెక్టు పరిశీలన



వాటర్ లెవల్ రికార్డర్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం

ధారూరు: మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టును గురువారం సెక్రటేరియట్‌లో పనిచేస్తున్న ఇరిగేషన్‌శాఖ రాష్ట్ర బృందం పరిశీలించింది. ప్రాజెక్టుకు వస్తున్న వరదనీటిని, అలుగు ద్వారా కాగ్నానదిలోకి వెళ్తున్న నీటిని వారు పరిశీలించారు. ప్రాజెక్టుకు ఎడమవైపు ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ వాటర్ లెవల్ రికార్డర్‌ను వారు పరిశీలించారు.

పోరాట వారోత్సవాలు

చేవెళ్ల: ఈ నెల 11వ తేదీనుంచి 17వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో గురువారం సీపీఐ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేవెళ్లలోని అంబేడ్కర్‌భవన్‌లో ఈ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుభాన్‌రెడ్డి, సత్యనారాయణ, మక్బుల్, శివ, గీత, రాములుగౌడ తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



విద్యార్థినికి చెక్కు అందిస్తున్న రఘునందన్‌రావు తదితరులు

చేవెళ్ల: సంపాదించిన దాంట్లో కొంతైనా పేదలకు దానం చేసే సేవాగుణం ప్రతి ఒక్కరిలో ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి, ఐఏఎస్ అధికారి రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని కమ్మెట సమీపంలో నిర్మించిన విహార సురవి ప్రాజెక్టులో గురువారం విహార సురవి ప్రాజెక్టు, హర్షఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు కోసం పనిచేసిన 15 కూలీ కుటుంబాలకు రూ.లక్ష చొప్పున.. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద వారికి కొంతైనా వెచ్చించడం అనేది గొప్ప నిర్ణయమన్నారు. పర్యావరణవేత్త, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

'పట్నం' బీజేపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

ఇబ్రహీంపట్నం: బీజేపీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శాంతికుమార్ గురువారం దరఖాస్తు చేసుకున్నాడు. యాచారం మండలం ధర్మన్నగూడకు చెందిన ఆయన ఏబీవీ పీ, తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు.

ఇన్నర్ పీస్ మ్యూజియం భేష్

డీజీపీ అంజనీకుమార్



ఆర్ట్ ట్రీట్ ప్రదర్శనలో డీజీపీ అంజనీ కుమార్ తదితరులు

షాద్‌నగర్: మంచి ఆలోచనలతో అద్భుతమైన కళాకండాలను రూపొందించవచ్చని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. నందిగామ మండలంలోని కన్హా శాంతి వనం ఇన్నర్‌పీస్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఆర్ట్ రీట్రీట్ ప్రదర్శనను గురువారం ఆయన సందర్శించారు. గత నెల 29న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది కళాకారులు పాల్గొని సుందరమైన చిత్రాలను గీశారు. శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు, పద్మభూషణ్ పురస్కార్ అవార్డు గ్రహీత దాజీతో కలిసి డీజీపీ కళారూపాలను వీక్షించారు. మంచి ఆలోచనలతో గీసిన చిత్రాలు అందరినీ ఆకట్టుకుంటాయని, ఆలోచింపజేస్తామని తెలిపారు.

ప్రతీ ఇంటికి తాగునీరు

తుర్కయంజాల్: వార్డు పరిధిలోని ప్రతీ ఇంటికి తాగునీరు అందజేస్తామని 18వ వార్డు కౌన్సిలర్ సునీల్ తెలిపారు. గురువారం అన్నపూర్ణ కాలనీలో మంచినీటి పైప్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులు కౌన్సిలర్‌ను ఘనంగా సన్మానించారు.

తెలంగాణలో అధికారంలోకి వస్తాం

- ఏఐసీసీ కార్యదర్శి, కేరళ రాష్ట్ర ఎమ్మెల్యే విష్ణునాథ్
- వికారాబాద్‌లో భారత్ జోడో సమ్మేళన్ యాత్రకు విశేష స్పందన



భారత్ జోడో సమ్మేళన్ పాదయాత్రలో కాంగ్రెస్ శ్రేణులు

అనంతగిరి: తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఏఐసీసీ కార్యదర్శి, కేరళ రాష్ట్ర ఎమ్మెల్యే విష్ణునాథ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో పాదయాత్ర పూర్తిచేసి సంవత్సరం పూర్తయిన సందర్భంగా గురువారం వికారాబాద్ పట్టణంలో ఆ పార్టీ శ్రేణులు భారత్ జోడో సమ్మేళన్ పాదయాత్రను నిర్వహించారు. ఆలంపల్లి దర్గానుంచి బీజేఆర్ చౌరస్తా వరకు పాదయాత్ర సాగింది. అనంతరం జరిగిన సమావేశంలో విష్ణునాథ్ మాట్లాడుతూ..రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఎంతో మందికి స్ఫూర్తినిచ్చిందన్నారు. ఈ యాత్ర స్ఫూర్తితో హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని ఆయన తెలిపారు. అదే స్ఫూర్తితో తెలంగాణలో అధికారంలోకి వస్తామన్నారు. అనంతరం మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ అని.. అన్ని వర్గాలకు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. ఈ యాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. 17న హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభలో సోనియాగాంధీ పాల్గొంటారని.. కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కిషన్‌నాయక్, బ్లాక్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కౌన్సిలర్ మురళి, సీనియర్ నాయకులు రత్నారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కమాల్‌రెడ్డి, అనంతయ్య, లక్ష్మణ్, యువజన నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తాం

ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

బంట్వారం: బీఆర్‌ఎస్ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కోట్‌పల్లి మండలం కంకణాలపల్లి గ్రామానికి చెందిన పలువురు గురువారం వికారాబాద్‌లో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. కష్టపడి పనిచేసేవారికి భవిష్యత్‌లో తగిన గుర్తింపు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు అనిల్, ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, నాయకులు కరుణాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోహింగ్యాల అరెస్టు

పహాడీషరీఫ్: అక్రమంగా ఆధార్ కార్డు పొంది పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్న మయన్మార్ దేశానికి చెందిన ఇద్దరు రోహింగ్యా ముస్లింలను బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మయన్మార్(బర్మా) దేశానికి చెందిన ఆయేషా సిద్దిఖీ(24), మహ్మద్ హుస్సేన్(47) శరణార్థులుగా వచ్చి హైదరాబాద్‌లోని రాయల్ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరు అక్రమంగా ఆధార్ కార్డును పొందారు. ఆ కార్డు ఆధారంగా పాస్‌పోర్టుకు సైతం దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్‌ఐ షేక్.యూసుఫ్ జానీ బృందం చాకచక్యంగా వారిని అరెస్ట్ చేసింది. వీరికి సహకరించిన మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.

పథకం ప్రకారమే హత్య

- వీడిన ప్రవీణ్ మృతి మిస్టరీ
- హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం
- ఏడుగురు నిందితుల అరెస్టు, రిమాండ్
- వివరాలు వెల్లడించిన చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

షాబాద్: వివాహేతర సంబంధం ఓ హత్యకు దారితీసింది. మనస్పర్థల కారణంగా నెలకొన్న గొడవలతో పథకం ప్రకారమే యువకుడిని హత్య చేశారు. ఈ నెల 4న వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించిన కేసు వివరాలను గురువారం చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండల పరిధిలోని హైతాబాద్ చెరువులో ఈనెల 4న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పైకి తేలింది. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలియజేశారు. సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్న సీఐ యాదయ్యగౌడ్ చెరువులో నుంచి బాడీని బయటకు తీయించారు. మృతుడి వివరాలను ఆరా తీయగా.. సంకెపల్లిగూడకు చెందిన కుమ్మరి ప్రవీణ్(31) అనే వ్యక్తి.. ఈనెల 1న రాత్రి 9గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని, కుటుంబ సభ్యులు అతని కోసం వెతుకున్నారని తెలిసింది. దీంతో గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా.. అక్కడకు వెళ్లిన బాధిత కుటుంబ సభ్యులు మృతదేహం ప్రవీణ్‌దేనని గుర్తించారు. తల వైపు ఒక సంచి, కాళ్ల వైపు మరో సంచి కట్టి.. చున్నీతో చేతులను వెనక్కి కట్టేసి.. నడుముకు బండరాయి కట్టి చెరువులో పడేసిన ఆనవాళ్లు కనిపించాయి. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

విచారణలో నేరం అంగీకారం..

హతుడు ప్రవీణ్‌కు ఇదే గ్రామానికి చెందిన కుమ్మరి మమతతో వివాహేతర సంబంధం ఉందని పోలీసులు తెలుసుకున్నారు. ఈ దిశగా విచారణ చేపట్టి మమతతో పాటు ఆమె కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుని కూపీ లాగగా తామే హత్య చేసినట్లు అంగీకరించారు. మమత భర్త సుధాకర్ గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆ తర్వాత ప్రవీణ్, మమత మధ్య పరిచయం, సాన్నిహిత్యం వివాహేతర సంబంధానికి దారితీసింది. దీంతో మృతుడు పదేపదే మమత ఇంటికి వెళ్లేవాడు.

మనస్పర్థలతో శత్రుత్వం

కొద్దిరోజులుగా మమత, ప్రవీణ్ మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ వ్యవహారాలు గొడవల వరకూ వెళ్లాయి. దీంతో ఇరువురి మధ్య దూరం పెరిగింది. అయినప్పటికీ ప్రవీణ్ మాత్రం మొండిగా వారి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో మమత అతనిపై శత్రుత్వం పెంచుకుంది. ప్రవీణ్‌తో తనకు ఇబ్బందులు తప్పేలా భావించి, ఎలాగైనా అతన్ని చంపేయాలని నిర్ణయించుకుంది.

ఆ రోజు జరిగింది ఇదీ..

ఈనెల 1న ప్రవీణ్‌కు ఫోన్ చేసిన మమత ఇంటికి రావాలని చెప్పింది. దీంతో అతడు వెళ్లి తాను ఎప్పటిలాగే మిద్దెపై ఉన్నానని, పైకి రావాలని కోరగా.. మా అత్త, మామ పడుకున్నారు.. ఇంట్లో ఎవరూ లేరు నువ్వే కిందికి రా.. అని సూచించింది. ఇది నమ్మిన మృతుడు ఇంట్లోకి వెళ్లగానే గడియ పెట్టింది. అప్పటికే మమతతో పాటు ఆమె అత్త, మామ, తల్లి, అన్న, మరో వ్యక్తి ఉన్నారు. ప్రవీణ్ చూసిన వారు అతనితో గొడవ పడ్డారు. హతుడు సైతం వీరితో గట్టిగానే వారించాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న రోకలితో వెనక నుంచి ప్రవీణ్ తలపై మమత బలంగా కొట్టింది. ఆమె అన్న కుమార్ సైతం కొట్టడంతో ప్రవీణ్ పెద్దగా అరుపులు చేశాడు. దీంతో అతడి నోటికి చున్నీ బిగించి.. తల, కాళ్లపై రోకలితో మోదారు. దీంతో స్పృహ తప్పిన ప్రవీణ్ రక్తస్రావమై, ఊపిరాడక చనిపోయాడు.

శవాన్ని మూటగట్టి..

ప్రవీణ్ మరణించాడని నిర్ధారించుకున్న మమత అన్న కుమార్, ఇతడి బావమర్ది మహేశ్ శవాన్ని సంచిలో పెట్టి మూటకట్టారు. స్కూటీపై బాడీ పెట్టుకుని హైతాబాద్ చెరువు ఒడ్డున దింపారు. ఇక్కడ మృతదేహానికి బండరాయిని కట్టి చెరువులో పడేశారు. అనంతరం ఇంటికి వచ్చి రక్తం అంటిన దుస్తులకు నిప్పు పెట్టి కాల్చేశారు. మృతుడి సెల్‌ఫోన్‌ను ధ్వంసం చేసి కాల్చేశారు. ఆ తర్వాత ఎవరి ఇంటికి వారు వెళ్లిపోయారు.

సీసీ పుటేజీల తొలగింపు

ప్రవీణ్ వచ్చిన విషయం సీసీ కెమెరాల్లో రికార్డు అయిందని గ్రహించిన మమత దామర్లపల్లికి చెందిన కమ్మరి వెంకటేశ్ అనే వ్యక్తిని ఇంటికి పిలిపించి.. సీసీ పుటేజీలన్నింటినీ తీసేయించింది. ఈ కేసులో నిందితులైన కుమ్మరి మమత, కృష్ణయ్య, చంద్రకళ, కుమార్, లక్ష్మి, మహేశ్, కమ్మరి వెంకటేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వివరించారు. హత్యకు ఉపయోగించిన రోకలి, ఎలక్ట్రిక్ స్కూటీ, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో షాబాద్ సీఐ యాదయ్యగౌడ్, ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తెలుస్తలే..!

- ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్టీసీ బస్సుల్లో తప్పుల తడకగా తెలుగు
- రేపు తెలంగాణ భాషా దినోత్సవం





ఆర్టీసీ బస్సులో రాసిన తెలుగు పదాల్లో తప్పులు

బొంరాస్‌పేట: 'గిన్ని ఏండ్ల సంది తెలుగు భాష తప్పులువోకుండా రాసుదు, సదువుడు మనోల్లకు తెలుస్తనే లేదు'. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రజల భాష, యాస కోసం సాహిత్యపరంగా కవులు, రచయితలు ఉద్యమించారు. వేరుపడేందుకు ప్రాంతంకన్నా భాషపై దాడే ప్రధానం అని కొట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయినప్పటికీ మన ప్రభుత్వ విభాగంలో పనిచేసే పలు డిపార్ట్‌మెంట్లలో తెలుగు పదాలను తప్పుల తడకగా రాస్తున్నారు. కొన్ని కార్యాలయాల్లో తెలుగు భాష వాడటమే మానేశారంటే అతిశయోక్తి కాదు. ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యత కల్పించాలని, ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో తెలుగుభాషలోనే సమాచారం ఇవ్వాలనే నిబంధనలు కూడా ఉన్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడంలేదు. కాగా ప్రభుత్వ కార్యాలయాల్లో గోడలపై, ఆర్టీసీ బస్సులో రాసిఉన్న సూచనలు, నినాదాలు చూస్తుంటే నవ్వుపుట్టించడంతో పాటు మన అధకారులకు తెలుగుభాషపై ఎంత నిర్లక్ష్యం ఉందో ఇట్టే తెలుస్తోంది.

నేడు ప్రజాకవి జయంతి..

తెలంగాణ యాసను, భాషను చాటిచెప్పి తెలంగాణ ప్రజాకవిగా సాహిత్య చరిత్రకెక్కిన కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషపై మరింత దృష్టి సారించాలని సాహిత్యకారులు కోరుతున్నారు. పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని, ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాల్లో స్వచ్ఛమైన తెలంగాణ తెలుగును ఉపయోగించి తెలుగు భాష గౌరవాన్ని కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందంటున్నారు.

హక్కులను కాలరాస్తున్నారు

ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మంతుముదిరాజ్



మాట్లాడుతున్న హన్మంతుముదిరాజ్

పరిగి: ముదిరాజ్‌ల హక్కులను బీఆర్‌ఎస్ పార్టీ కాలరాస్తోందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మంతుముదిరాజ్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ముదిరాజ్ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ 115 ఎమ్మెల్యే సీట్లను ప్రకటిస్తే రాష్ట్రంలో ఒక్క ముదిరాజ్‌కు సీటు కేటాయించకపోవడం విడ్డూరమన్నారు. రాష్ట్రంలో అధికశాతం ఓట్లు ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గాన్ని సీఎం కేసీఆర్ అవమానపరుస్తున్నారన్నారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మారుస్తామని చెప్పి మార్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన బీసీ బంధు పథకంలో ముదిరాజ్‌లకు అవకాశం కల్పించకపోవడం దేనికి సంకేతమన్నారు. మన హక్కులను మనం ఎలిగిచాటేందుకు ఈనెల 15న పరిగి పట్టణ కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

ఇక పనులు చకచకా..



క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కార్యాలయం కోసం ముస్తాబవుతున్న భవనం

- ఇబ్రహీంపట్నంలో పీఆర్ ఇంజనీరింగ్ డివిజన్, క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కార్యాలయాలు
- 10న మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ప్రజలు, అధికారులకు తీరనున్న దూరభారం

ఇబ్రహీంపట్నం: పరిపాలనా సౌలభ్యం కోసం ఇబ్రహీంపట్నంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డివిజన్, క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇదివరకు పీఆర్ ఇంజనీరింగ్ డివిజన్ కార్యాలయం ఖైరాతబాద్‌లోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉండేది. ఆ విభాగాన్ని రెండు డివిజన్లు చేశారు. ఒక డివిజన్ ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేస్తుండగా మరో డివిజన్ యధావిధి స్థానంలో కొనసాగనుంది. స్థానిక డిప్యూటీ పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయ భవనంలో డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ భవనంలోని డిప్యూటీ పీఆర్ కార్యాలయాన్ని దాని వెనుకవైపు ఖాళీగా ఉన్న భవనంలోకి మార్చుతున్నారు. ఈ డివిజన్ పరిధిలో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం, కందుకూర్, ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల్ మండలాలు వస్తాయి. ఈ కార్యాలయాల ఏర్పాటుతో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో చేపట్టే రోడ్లు, భవనాల నిర్మాణాలకు సంబంధించిన పనులు త్వరితగతిన అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది.

పీఆర్ క్వాలిటీ కంట్రోల్ సబ్‌డివిజన్ కార్యాలయం..

ఉప్పల్‌లో ఉన్న పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కార్యాలయం కూడా ఇక్కడికే తరలిరానుంది. ఈ కార్యాలయాన్ని స్థానిక డివిజన్ పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయ భవనం వెనుక ఉన్న మరో ఖాళీ భవనంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇక పీఆర్ ఇంజనీరింగ్‌కు సంబంధించిన పనుల కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు, గుత్తేదారులు నగరానికి వెళ్లాల్సిన అవసరం తప్పనుంది.

10న ప్రారంభోత్సవాలు...

ఈనెల 10న మంత్రి సబితారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చేతులమీదుగా ఈ కార్యాలయాలను ప్రారంభించనున్నారు. సమయం తక్కువగా ఉండటంతో ఈ మేరకు ఆయా భవనాల మరమ్మతులు, కలర్స్ వేసే పనులను ఆఘామేఘాల మీద చేపడుతున్నారు. ఆయా పనుల్లో అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు.

నగరానికి వెళ్లాల్సిన అవసరం లేదు



పీఆర్ ఇంజనీరింగ్ డివిజన్, క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కార్యాలయాలు రెండూ కూడా ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు అవుతున్నాయి. డివిజన్ పరిధిలోని 10 మండలాలు ఈ కార్యాలయాల పరిధిలోకి వస్తాయి. 10వ తేదీ ఉదయం 10 గంటలకు మంత్రి సబితారెడ్డి ఈ కార్యాలయాలను ప్రారంభిస్తారు. ఇకనుంచి పీఆర్ ఇంజనీరింగ్ విభాగంలోనిరోడ్లు, భవనాలకు సంబంధించిన పనుల కోసం నగరానికి వెళ్లాల్సిన అవసర ఉండదు.

– శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ పీఆర్ ఈఈ, ఇబ్రహీంపట్నం

బడా వ్యాపారులకు కొమ్ముకాస్తున్నారు

సీపీఎం శ్రేణుల రాస్తారోకో



యాచారం: సాగర్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు

యాచారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో పేదలు బతకలేని స్థితిలో ఉన్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.మధుసూదన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర ధరల పెరుగుదల, అసైన్డ్ భూములు లాక్కోవడం, ఉపాధి అవకాశాలు కల్పించకపోవడాన్ని నిరసిస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం యాచారం మండల కేంద్రంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు బడా వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు కొమ్ముకాస్తున్నాయన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఫార్మాసిటీకి భూసేకరణ పేరుతో బలవంతం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కి తగిన గుణపాఠం చెప్పడానికి బాధిత రైతులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు అంజయ్య, మండల కార్యవర్గ సభ్యులు బ్రహ్మయ్య, జంగయ్య, చందునాయక్, పెద్దయ్య, బాషయ్య, జగన్, వినోద్‌కుమార్, విప్లవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును వ్యతిరేకిస్తూ మంచాల మండల కేంద్రంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగుడాల యాదయ్య మాట్లాడుతూ.. నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచి పేదోడిపై భారం మోపుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వాలు తమ తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు రాజు, స్వామి, యాదగిరి, నర్సింహ, బాలరాజ్, శేషగిరి, వెంకన్న, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు విఫలం..

ఇబ్రహీంపట్నం రూరల్: ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం ఇబ్రహీంపట్నం మండల కమిటీ సభ్యులు విగ్నేష్ మండిపడ్డారు. పెరిగిన ధరలను తగ్గించాలని సీపీఎం పార్టీ కప్పపహాడ్ గ్రామశాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శులు ప్రభుదాస్, భిక్షపతి, సురేష్, వార్డు సభ్యులు రాజశేఖర్, నాయకులు శివుడు, శంకరయ్య, మహంకాళి, సంజీవ, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సామేల్ పిలుపునిచ్చారు. సీపీఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ నేతలు గురువారం ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సీహెచ్.జంగయ్య, ఎల్లేశ్, జగన్, గణేశ్, బుగ్గరాములు, నర్సింహ, పురుషోత్తం, స్వప్న, విజయమ్మ, వీరేష్ పాల్గొన్నారు.

ప్రజలే బుద్ధి చెబుతారు..

షాద్‌నగర్: హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా గురువారం సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు ఆధ్వర్యంలో షాద్‌నగర్ చౌరస్తాలో ఆ పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. మణిపూర్‌లో దేశ ప్రజలపై అరాచకాలు జరుగుతున్నా ప్రధానమంత్రి ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుర్మయ్య, చంద్రమౌళి, రాజశేఖర్, జంగయ్య, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేష్, కృష్ణయ్య, లలిత, రాధిక, సరిత, శ్వేత, శివ, వెంకటేష్, రాజు, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేసీఆర్

బీజేపీ సీనియర్ నాయకుడు ఆచారి



కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఆచారి

కడ్తాల్: కేంద్రం ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను, గడప గడపకు వెళ్లి ప్రజలకు వివరించేందుకే మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ సీనియర్ నాయకుడు టి. ఆచారి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పల్లెపల్లెన బీజేపీ– ఇంటి ఇంటికి ఆచారి కార్యక్రమాన్ని గురువారం మండలంలోని రావిచేడ్, మద్దెలకుంట తండాలో నిర్వహించారు. ప్రధానమంత్రి బీమా యోజన, ఆయుష్మాన్ భారత్, సుకన్య సమృద్ధి యోజన తదితర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కేంద్రం పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, నాయకులు భగీరథ్, రాములు, రాంచందర్, వెంకటయ్య, సాయిలాల్, శ్రీశైలం, మహేశ్, రాందాస్ నాయక్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.